నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, సోమవారం 27 మే 2024 | SURYAPET

## సజావుగా జేఈఈ అడ్వాన్స్ పరీక్ష

రామగిరి, మే 26 : జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రం ఎస్‌పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో సజావుగా ముగిసింది. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పేపర్ – 1, 2 పరీక్షకు 340 మంది విద్యార్థులకు 335మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి తెలిపారు. ఉదయం 170మందికి 169మంది, మధ్యాహ్నం 170మందికి 166మంది హాజరైనట్లు పేర్కొన్నారు.



నల్లగొండలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు


నల్లగొండలో బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

# నేడే పోలింగ్

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- 12 జిల్లాల పరిధిలో 605 పోలింగ్ కేంద్రాలు
- మొత్తం 4.63,839 మంది ఓటర్లు
- బరిలో 52 మంది అభ్యర్థులు
- ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- పోలింగ్ ముగిశాక ఈవీఎంలన్నీ నల్లగొండలోని స్ట్రాంగ్ రూముకు రాక
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్ హరిచందన
- పటిష్టమైన బందోబస్తు : ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ ప్రతినిధి, మే26(నమస్తే తెలంగాణ) : వరంగల్ –ఖమ్మం– నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఆదివారం సాయంత్రమే ఆయా జిల్లా కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలు పెట్టి 8 గంటల వరకు సర్వం సిద్ధంగా ఉంటారు. మొత్తం 12 జిల్లాలో పరిధిలో విస్తరించి ఉన్న నియోజకవర్గంలో 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ పట్టణాలతోపాటు ఓటర్ల సంఖ్యను భట్టి ఆయా మండల కేంద్రాల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా నియోజకవర్గ పరిధిలో 4,63,839 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం మొత్తం ఓటర్లలో పురుషులు 2,88,189మంది, మహిళలు 1,75,645 మంది, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు ఉన్నారు. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,66,448 మంది ఓటర్లు ఉండగా అందులో నల్లగొండ జిల్లాలో 80,871 మంది, సూర్యాపేట జిల్లాలో 51,497 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 34,080 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు. ముఖ్యంగా ఇతర ఎన్నికలకు ఎమ్మెల్సీ ఎన్నికలకు తేడా ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు ఓటు వేయాల్సి ఉండడంతో అందుకు అనుగుణంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోస్టర్‌తోపాటు, ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో టెంట్స్, సరైన లైటింగ్, బయట మెడికల్ టీమ్స్ లాంటి మౌలిక వసతులు కూడా కల్పించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కూడా అమలులో పెట్టారు. పోలింగ్ పూర్తి సజావుగా నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ప్రకటించారు. పోలింగ్‌కు పటిష్టమైన పోలీస్ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి తెలిపారు.


నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


నల్లగొండలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన


సూర్యాపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే


సూర్యాపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బస్సులో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది


మద్దిరాలలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

### పట్టభద్రుల ఓటర్ల వివరాలు

| జిల్లా | పురుషులు | స్త్రీలు | టీజీ | మొత్తం |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 3,122 | 1,557 | 0 | 4,679 |
| జనగాం | 14,915 | 8,503 | 1 | 23,419 |
| హనుమకొండ | 25,739 | 17,990 | 0 | 43,729 |
| వరంగల్ | 27,038 | 16,774 | 0 | 43,812 |
| మహబూబాబాద్ | 22,948 | 11,985 | 0 | 34,933 |
| ములుగు | 6,587 | 3,712 | 0 | 10,299 |
| జె.భూపాలపల్లి | 8,000 | 4,535 | 0 | 12,535 |
| భద్రాద్రి | 22,590 | 17,516 | 0 | 40,106 |
| ఖమ్మం | 50,676 | 33,199 | 4 | 83,879 |
| యాదాద్రి భువనగిరి | 20,838 | 13,242 | 0 | 34,080 |
| సూర్యాపేట | 34,176 | 17,321 | 0 | 51,497 |
| నల్లగొండ | 51,560 | 29,311 | 0 | 80,871 |
| మొత్తం | 2,88,189 | 1,75,645 | 5 | 4,63,839 |

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, మే 23 : వరంగల్ –ఖమ్మం– నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉపఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫాన్సెస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది తరలింపు ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప ఎన్నిక జరిగే 12 జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుందని, ఓటు ఎలావేయాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. ఇందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోస్టర్‌తో పాటు, ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆమె కోరారు.

అనంతరం కలెక్టర్ పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, టి.పూర్ణచంద్ర, నల్లగొండ, మిర్యాలగూడ ,చండూరు, దేవరకొండ ఆర్‌డీఓలు, నాగిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ ఇతర అధికారులు, తాసీల్దార్లు ఉన్నారు.

# పట్టభద్రులూ.. జాగ్రత్తగా ఓటెయ్యండి!

**లేదంటే ఓటు చెల్లుబాటు కాదు**

- అనుమానం ఉంటే మరోసారి తెలుసుకోండి
- ప్రతి ఒక్కరూ '1'వ ప్రాధాన్యత ఇవ్వాల్సిందే
- ఆ తర్వాత ఎన్ని ప్రాధాన్యతలు ఇవ్వాలనేది ఓటరు ఇష్టం
- ఇంగ్లిష్, రోమన్ అంకెలతోనే ప్రాధాన్యత ఇవ్వాలి
- అక్షరాల్లో రాయడం... రైట్ గుర్తు పెట్టడం చెల్లవు
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలి
- 2021, 2015లో భారీగా చెల్లని ఓట్లు
- గుర్తింపు కార్డు ఉంటేనే ఓటింగ్‌కు అనుమతి

నల్లగొండ ప్రతినిధి, మే 26 (నమస్తే తెలంగాణ) : 2021 మార్చిలో వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ జరిగింది. మొత్తం 3,87,969 మంది ఓట్లు వేయగా అందులో 21,636 మంది ఓట్లు చెల్లకుండా పోయాయి. ఇది మొత్తం పోలింగ్‌లో 5.57శాతం కావడం గమనార్హం. ఇక ఇదే తరహాలో 2015 మార్చిలో జరిగిన ఎన్నికలోనూ మొత్తం పోలైన ఓట్లలో 9.14శాతంతో 14,039 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఇవేవో సాధారణ ఎన్నికలు అనుకుంటే చదువు రాని నిరక్షరాస్యులు, అంతంతమాత్రం చదువొచ్చినోళ్లు కూడా ఓటర్లలో ఉన్నారనుకోవచ్చు. కానీ పట్టభద్రుల ఎన్నికలు.. అందరూ డిగ్రీ, ఆపై చదువులు పూర్తి చేసిన వారే ఓటర్లుగా ఉంటారు. అయినా చెల్లని ఓట్ల సంఖ్య గణనీయంగా ఉంటుండడం తీవ్ర ఆందోళనకర అంశమే. అందుకే నేడు జరుగబోయే పోలింగ్ లోనూ ఎన్నికల నిబంధనలపై పట్టభద్రులైన ఓటర్లు పూర్తి అవగాహనతో ఓటింగ్‌కు వెళ్లాల్సిందే. అవసరమైతే ఓటింగ్‌కు వెళ్లేముందు మరోసారి ఓటింగ్ విధానం తెలుసుకుంటే మరీ మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు

వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నేడు ఉదయం ఎనిమిది గంటల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా 12 జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 605 కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. ఆదివారం సాయంత్రానికే పోలింగ్ సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే ఏజెంట్ల నియాయక ప్రక్రియ ఆ తర్వాత నిర్ణీత సమయం ప్రకారం పోలింగ్ మొదలుపెడతారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ సారి కూడా భారీ సంఖ్యలో 52 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతోపాటు ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. మొత్తం 4,63,839 మంది ఓటర్లకుగానూ 2,88,189 మంది పురుషులు, 175,645 మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

#### బాక్స్‌లో స్పష్టంగా రాయాలి

బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లకు ఎదురుగా వారి ఫొటో ఆ తర్వాత ఓటు వేసేందుకు ఒక బాక్స్ ఉంటుంది. ఆ బాక్స్‌లోనే మనం ప్రాధాన్యత ఓటును అంకెల్లో వేయాల్సి ఉంటుంది. ఇలా అంకెల్లో వేసేటప్పుడు కూడా జాగ్రత్తగా బాక్స్ మధ్యలో స్పష్టంగా అర్థమయ్యేలా రాయాలి. బాక్స్ చివరల్లో లేదంటే బాక్స్ దాటి అటుఇటు అంకెలు రాసినా వాటిని పరిగణలోకి తీసుకోరు. ఇంకో విషయమేమింటే ఈ సారి బ్యాలెట్ పేపర్‌లో మూడు వరుసల్లో అభ్యర్థుల జాబితా ఉంటుంది. ఓటు వేయాలనుకున్న అభ్యర్థి ఎదురుగా ఫొటో పక్కనే ఉన్న గడిలోనే ఓటు వేయాల్సి ఉంటుంది. ఇందులో అనుమానాలు ఉంటే పోలింగ్ అధికారిని అడిగి తెలుసుకోవచ్చు. ఓటింగ్‌కు వచ్చే ప్రతి ఓటరు పూర్తి అవగాహనతో వస్తే ఈ సారి చెల్లని ఓట్లను నివారించినట్లవుతుంది. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని నమ్మి పోలింగ్ కేంద్రానికి వచ్చి తప్పు చేస్తే ఫలితం లేదు.

### అభ్యర్థుల ప్రాధాన్యతపై ముందే సిద్ధం కావాలి

ఈ సారి అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్ సైజ్ భారీగా ఉండనుంది. బ్యాలెట్ పేపర్ మూడు వరుసల్లో ఉండనుంది. ఇందులో అభ్యర్థుల వివరాలు, ఫొటోలను పొందుపరిచారు. దీన్ని మూడు మడతలుగా చేసి పెన్‌తోపాటు బ్యాలెట్ పేపర్‌ను ఓటరు చేతికి ఇస్తారు. ఓటు వేసేందుకు కేటాయించిన సీక్రెట్ స్థలంలో బ్యాలెట్ పేపర్‌ను పూర్తిగా విప్పదీసి ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ సారి ఓటు వేసేటప్పుడు పట్టభద్రుడైన ఓటరు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. తాను ఓటు వేయాల్సిన అభ్యర్థి లేదా అభ్యర్థులు ఎక్కడ ఉన్నారో జాగ్రత్తగా పరిశీలించి ప్రాధాన్యత ప్రకారం ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రతి ఓటరు కూడా తొలి ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందే. ఇలా ఇవ్వనిచో ఆ ఓటు చెల్లుబాటు కాదు. తర్వాత ఎన్ని ప్రాధాన్యతలు ఇచ్చినా వాటిని పరిగణలోకి తీసుకోరు.



#### '1' ప్రాధాన్యత తప్పనిసరి

ఓటు వేసే సమయంలో ప్రతి ఓటరు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాల్సిందే. తర్వాత తనకు నచ్చిన ఇతర అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు చేయవచ్చు. మొత్తం 52 మంది అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసే స్వేచ్ఛ ఓటరుకు ఉంటుంది. ఇలా ఓటు వేసే క్రమంలో ఎక్కడా కూడా ప్రాధాన్యత క్రమం తప్పకుండా చూసుకోవాలి. ఓటు వేసేటప్పుడు కచ్చితంగా ఇంగ్లిష్ లేదా రోమన్ అంకెల్లో ఓటు వేయవచ్చు. సులువైన పద్ధతి అయితే ఇంగ్లిష్ అంకెలను వాడడమే. ఉదాహరణకు అభ్యర్థికి 50వ ప్రాధాన్యత ఓటు ఇవ్వాలనుకుంటే రోమన్ అంకెల్లో ఓటు వేయాలంటే చాలా లాంగ్ ప్రాసెస్ ఉంటుంది. అదే ఇంగ్లిష్ అంకెల్లో అయితే '50' ఇలా వేస్తే సరిపోతుంది. అందుకే ఇంగ్లిష్ అంకెలుగా పిలువబడే '1,2,3,4,5,.... 71' వరకు ప్రాధాన్యతలు ఇస్తూ వెళ్లవచ్చు. ఇలా అంకెలు కాకుండా అక్షరాల్లో రాస్తే అవి చెల్లుబాటు కావు. ఉదాహరణకు 'ఒకటి, రెండు, మూడు, నాలుగు.... డెబ్బై ఒకటి' ఇలా రాస్తే ఆ ఓటు చెల్లని ఓటు కిందే లెక్క. ఇక ఇవి కాకుండా రైట్ లేదా ఇతర గుర్తులు, చిహ్నాలు ఇవేవీ బ్యాలెట్ పేపర్ పైన రాసినా అవి కూడా చెల్లని జాబితాలోకే వెళ్తాయి.

### కిందటి సారి చెల్లని ఓట్లు 5.57శాతం

ఓటర్లంతా పట్టభద్రులే... కనీసం డిగ్రీ చదువు పూర్తి చేసి ఆ విద్యకు తగ్గ ప్రత్యేక ఓటు పొందిన మేధావులు. వాళ్లలో ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల వంటి వారు ఉన్నారు. అయితేనేం అంతటి మేధావులు సైతం ఓటేయడంలో తప్పటడుగు వేశారు. అందుకే 2021 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వాళ్లల్లో 5.57శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. 3,87,969 మంది ఓటు వేయగా 21636 మంది ఓట్లు చెల్లలేదు. 2015 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాళ్లేసిన ఓట్లలో 9.14శాతం చెల్లుబాటు కాలేదు. మొత్తం 1,53,547 ఓట్లు పోలుకాగా 14,039 ఓట్లు చెల్లుబాటు కాలేదు. గతంలో జరిగిన పొరపాట్లను ఓ సారి పరిశీలిస్తే.. ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రాధాన్యతలను పెన్నుతో స్పష్టంగా అంకెల్లో రాయాలని ఉన్నా... చాలా మంది అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న డబ్బాలో టిక్ చేసి కనిపించాయి. కొందరు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వకుండానే ద్వితీయ, తృతీయ ఓట్లు వేశారు. మరికొందరైతే బ్యాలెట్ పత్రాలపై ఏవేవో రాతలు రాశారని కూడా తెలిసింది. ఇలా మొత్తం పోలైన ఓట్లలో అవగాహన లోపంతో తమ ఓట్లను వృథా చేసుకున్నట్లుగా స్పష్టమవుతున్నది.


కట్టంగూర్‌లో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు


తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో నేలకూలిన విద్యుత్ స్తంభం


చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

# గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు.. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల ఎగిరిపడిన ఇంటి పైకప్పు రేకులు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం.. నేలరాలిన మామిడి కాయలు
- సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిలిచిన కరెంట్ సరఫరా
- పిడుగుపాటుకు ఎద్దు, రెండు గొర్రెలు మృతి

రామగిరి/ హాలియా/ కట్టంగూర్/ కొండమల్లేపల్లి/ గుడిపల్లి/ పెద్దవూర, చౌటుప్పల్ మే 26 : ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం మేఘావృతమై ఒక్కసారిగా వీచిన గాలివానతో నల్లగొండ జిల్లాలోని పలు చోట్ల తీవ్ర నష్టం జరిగింది. జిల్లా కేంద్రంతోపాటు కనగల్, తిప్పర్తి, కట్టంగూర్, పెద్దవూర, అనుముల మండలాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. నల్లగొండ మండలం చందనపల్లిలో దాసరి లలిత ఇంటి రేకులు ఎగిరిపడడంతో ఇంట్లోని వస్తువులను ధ్వంసమయ్యాయి. కట్టంగూర్‌లో పొడిచేటి పార్వతమ్మ, మునుకుంట్ల గ్రామంలో చెంబయ్య, వెంకన్న, సత్తయ్య ఇంటిపై కప్పు రేకులు గాలికి లేచిపోయాయి. నరేశ్, గోవర్ధన్ పశువుల కొట్టాలు కూలిపోయాయి. నల్లగొండ– కట్టంగూర్ రోడ్డులో పెద్ద సంఖ్యలో చెట్టు విరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండలోని పానగల్ ఫ్లైఓవర్ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దాంతో సాయంత్రం నుంచి రాత్రి వరకు చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు మండలాల్లో కరెంట్ వైర్లు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇక అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. హాలియాలో పిడుగుపాటుకు బొడ్డుపల్లి లింగయ్యకు చెందిన గంగిరెద్దు మృతి చెందింది. పెద్దవూర మండలం పులిచర్లలో పిడుగు పడి రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గుడిపల్లి మండలంలోని నడిమిబావి గూడెంలో వడ్డెపల్లి భరత్‌రెడ్డి ఇంట్లోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో పిడుగు పడడంతో పంగ ఏడుకొండల్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. చేతికంది వచ్చిన కాయలు రాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌తో పాటు పలుచోట్ల వర్షానికి ధాన్యం తడిసింది.


నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో కూలిన చెట్టు


నల్లగొండ మండలం చందనపల్లిలో ఎగిరిపోయిన ఇంటి రేకులు


కొండమల్లేపల్లి : గుమ్మడవెల్లిలో పిడుగు పడి తగలబడుతున్న గడ్డివాము

## రఘురామ రైస్‌మిల్ యజమానుల అరెస్ట్

**సీఎంఆర్‌లో అవకతవకలకు పాల్పడినందుకు కేసు నమోదు**

నాగారం, మే 26 : మండలంలోని ఈటూరు గ్రామ ఆవాసం ప్రగతినగర్‌లోని రఘురామ ఇండస్ట్రీస్ యజమాన్యం ఇమ్మడి సోమనర్సయ్య, సోమయ్యను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట జిల్లాలోని పలు మిల్లులు ప్రభుత్వానికి సీఎంఆర్ అందించకుండా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని కూడా స్వాహా చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేసి ధాన్యం నిల్వలు లేని మిల్లలపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యం ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడిన రఘురామ రైస్ మిల్లు యాజమాన్యాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో నాగారం సర్కిల్ పరిధిలోని ఈదులపరితండా వద్ద అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట తిరుమలగిరి ఎస్ఐ సత్యనారాయణగౌడ్ ఉన్నారు. కాగా అధికారులు రఘురామ మిల్లులో తనిఖీలు చేసి సీజ్ చేసిన ధాన్యం కూడా మాయం కావడం కొసమెరుపు.